బాడీ బిల్డింగ్ పోటీలకు లక్ష్మనాయుడు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిసెంబర్ 14,15 తేదీల్లో చండీఘర్ లో జరగనున్న జాతీయ బాడీ బిల్డింగ్ పోటీలకు జిల్లాకు చెందిన రెడ్డి లక్ష్మనాయుడు ఎంపికయ్యారు. ఈనెల 14న విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర పోటీల్లో ప్రథమ స్థానంలో నిలవడంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. లక్ష్మీనాయుడిని జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి శంకరరావు,కొరాడ శ్రీనివాసరావు అభినందించారు.

లక్ష్మనాయుడును అభినందిస్తున్న అసోసియేషన్ నాయకులు

పాత బగ్గాం రైతు సేవా కేంద్రం వద్ద గుమిగూడిన రైతులు

అన్నదాతల అగచాట్లు

- యూరియా అందక పాట్లు
- ఎరువుల దుకాణంలోకి దూసుకెళ్లిన అన్నదాతలు

ప్రజాశక్తి - గజపతినగరం

యూరియా కోసం అన్నదాతల ఇబ్బందులు కొనసాగుతున్నాయి. జిల్లా అంతటా యూరియా కోసం రైతులు పిఎసిఎస్‌లు, రైతు భరోసా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. గజపతినగరం మండల కేంద్రంలో రోజులుగా తెల్లవారుజాము నుండి మధ్యాహ్నం వరకు ఎండలో గంటల తరబడి నిల్చున్నా ఒక్క బస్తా యూరియా కూడాఅందని పరిస్థితి నెలకొంది. మంగళవారం మండల వ్యాప్తంగా ఐదు రైతు సేవా కేంద్రాలో 24 టన్నులు, మన గ్రోమోర్, సత్య ట్రేడర్స్ ఎరువుల దుకాణాల వద్ద 25 టన్నులు యూరియా పంపిణీకి ఏర్పాట్లు చేశారు. స్థానిక పిఎసిఎస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది సహకారంతో క్యూ లైన్‌లో రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రశాంతమైన వాతావరణంలో వన్ బి, ఆధార్ నమోదు చేసి అన్నదాతలకు సిప్పులు పంపిణీ చేసినప్పటికీ, ప్రైవేట్ ఎరువుల దుకాణాలు వద్ద ఈపాస్ యంత్రాలు పనిచేయకపోవడంతో అన్నదాతలు అసహనం వ్యక్తం చేశారు. తెల్లవారుజాము నుంచి క్యూలైన్లో నిలుచున్నప్పటికీ యూరియా సక్రమంగా పంపిణీ చేయడం లేదని ఆగ్రహిస్తూ అన్నదాతలు మన గ్రోమోర్, సత్య ట్రేడర్స్ ఎరువుల దుకాణాల్లోకి దూసుకెళ్లారు. దీంతో కొంతసేపు గందరగోళ పరిస్థితి ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న వ్యవసాయ శాఖ అధికారులు కలగజేసుకుని పరిస్థితిని కొంతమేర అదుపు చేశారు. అనంతరం ఎఒ సతీష్ ఆధ్వర్యంలో రైతులు క్యూలైన్లో ఒక్కో బస్తా తీసుకోవడానికి అంగీకరించారు. ఇదే విషయంపై పాత బగ్గాం, కొత్త బగ్గాం, తుమ్మికాపల్లి, కాలం రాజుపేట, పురిటిపెంట గ్రామాలకు చెందిన పలువురు రైతులు మాట్లాడుతూ... గతంలో ఎన్నడూ లేని విధంగా గత రెండు రోజులుగా యూరియా కోసం గంటల తరబడి నిరీక్షించినా ఒక్క బస్తా కూడా దొరికే పరిస్థితి లేదని అన్నారు. స్థానిక నాయకులు, అధికారులు అధిక సంఖ్యలో యూరియా నిల్వలు ఉన్నాయని చెబుతున్నారని, వారి మాటలలకు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని అంటున్నారు. ఉదయం నుంచి యూరియా కోసం ఎండల్లో నిలుచుని సిప్పులు అందుకుంటే, సాయంత్రానికి సిప్పులు ఉన్న యూరియా అందించే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమీప రైతు సేవా కేంద్రాలకు యూరియా సకాలంలో సరఫరా చేసి తమను ఆదుకోవాలని, లేదంటే సకాలంలో వరి పంటకు యూరియా అందక పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

1500 మంది రైతులకు 250 బస్తాలు

నెల్లిమర్ల : మండలంలోని సతివాడ, ఒమ్మి గ్రామాల్లో వరిసాగు చేసే రైతులు 1500 మంది ఉండగా కేవలం 250 యూరియా బస్తాలు వచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న సతివాడ, ఒమ్మి రైతులు యూరియా కోసం మంగళవారం సతివాడ రైతు సేవా కేంద్రంలో ఉదయం నుంచి క్యూ కట్టారు. కేవలం 250 బస్తాలు పంపిణీ చేయడంతో మిగతా వారు నిరాశతో వెనుదిరిగారు. నెల్లిమర్ల వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులు యూరియా స్లిప్‌ల కోసం ఎదురు చూసి యూరియా కోసం మన గ్రోమోర్ సెంటర్‌కి వెళ్లే సిబ్బంది తీరుపై దౌర్జన్యం చేసి బయటకు పంపించారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రామభద్రపురం : గ్రోమోర్‌షాప్ వద్ద బారులు తీరిన రైతులు

యూరియా కోసం పడిగాపులు

రామభద్రపురం: యూరియా కోసం రైతుల ఇక్కట్లు వర్ణనా తీతంగా ఉంది. రైతులు గ్రోమోర్ షాపు వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలోనే బారులు తీరి తోపులాటకు దిగారు. వివిధ గ్రామాల నుంచి భారీ ఎత్తున రైతులు రావడంతో హైవేపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. గ్రోమోర్ షాపు మేడపైకి కూడా రైతులు ఎక్కి యూరియా కోసం వాగ్వాదం చేశారు. గత కొన్ని రోజులుగా

రైతులందరికీ యూరియా ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-దత్తిరాజేరు

రైతులకు ఇబ్బంది లేకుండా అందరికీ యూరియాను పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. యూరియా కొరతతో రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడారు. మంత్రులు, అధికారులు చెప్పిన మాటలకు, వాస్తవానికి పొంతన ఉండడం లేదని, ఫలితంగా యూరియా అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. మంత్రులు అధికారులు చెప్పిన మాటకి వాస్తవానికి పొంతన లేదు. గజపతినగరం కేంద్రంలో వందల సంఖ్యలో బారులు తీరి రైతులు నరకయాతన పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం బిజెపి రాష్ట్రాలకు యూరియా అందించి మిగతా రాష్ట్రాలకు ఇవ్వటం లేదన్నారు. మన రాష్ట్రానికి కూడా తీరని కొరత ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడితెచ్చి యూరియా తెచ్చుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమయిందన్నారు. బయట మార్కెట్లో వ్యాపారులు దోపిడీ చేస్తున్నారన్నారు. రైతులకు సబ్సిడీలు ఇవ్వకుండా ఉండేందుకు నానో యూరియాను ప్రచారంలో పెట్టి కొరతపాటి నానో యూరియాను రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేశారని తెలిపారు. రైతులకు అవసరమైన యూరియాను వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

యూరియా సరఫరా కాకపోవ డంతో మండలంలో అన్ని గ్రామాల రైతులు తరలిరావడంతో ఈ పరిస్థితి నెలకొంది. సంఘటనా స్థలానికి బొబ్బిలి ఆర్‌డిఒ రామ్మోహనరావు, వ్యవసాయశాఖ ఎడి మధుసూదనరావులు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఎటువంటి ఘర్షణలూ తలెత్తకుండా ఎస్ఐ వెలమల ప్రసాద్ బందోబస్తు నిర్వహించారు.

రైతులకు యూరియా పంపిణీ

సంతకవిటి: మండలంలోని సురవరం రైతు సేవా కేంద్రంలోని మంగళవారం 444 యూరియా బస్తాలను రైతులకు పోలీసుల సమక్షంలో ఎఒ సిబి యశ్వంత్ రావు పంపిణీ చేశారు. ఈ మేరకు యూరియా కోసం రైతులు ఒక్కసారిగా బారులు తీరారు. దీంతో ఒక్కొక్క రైతుకు ఒక్కోక్క బస్తా చెప్పున పంపిణీ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న స్టాండింగ్ కమిటీసభ్యులు రాజేష్

ప్రోటోకాల్ ఉల్లంఘనపై స్టాండింగ్ కమిటీ ఆగ్రహం

- పైడితల్లమ్మ దేవస్థానం అధికారుల తీరుపై మండిపాటు
- నగర పాలక సంస్థ సహకారం అవసరం లేదా అంటూ ప్రశ్న
- 21 అంశాలతో కూడిన ఎజెండా ఆమోదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కొత్తవాహనాలు ప్రారంభం సమయంలో మేయర్‌కు ఆహ్వానం లేకుండా ప్రోటోకాల్ పాటించ కుండా అధికారులు వ్యవహరించడం సరికాదని, ఇలా జరిగితే ఉపేక్షించేదిలేదని స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు ఎస్‌వివి రాజేష్ మాట్లాడుతూ కొత్త ట్రాక్టర్లు ప్రారంభం సమయంలో ప్రోటోకాల్ ఉల్లంఘించడం సరికాదన్నారు. మూడున్నర కోట్ల తో కొనుగోలు చేసిన వాహనాలతో ముందు చెత్తలు ఎత్తేసి, తర్వాత వాటిని ప్రారంభించడం సరికాదబన్నారు. మేయర్‌ను పిలవకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.60లక్షలతో పండగకు ఖర్చు చేస్తున్న నగరపాలక సంస్థను కనీసం దేవాదాయ శాఖ వారు ఆహ్వానించకపోవడం దారుణ మన్నారు. డబ్బు మనది, అజమాయిషీ దేవాదాయ శాఖదా అని ప్రశ్నించారు. మున్సిపల్ సేవలు అవసరం లేదంటే తమ సేవలు ఆపేస్తామని హెచ్చరించారు. పండగ సందర్భంగా నగరంలో విధంగా లైటింగ్ బాగా అభివద్ధి చేస్తున్నారని, మిగిలిన స్తంభాలకు వేయాలని కోరారు. పండగకు తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. మరమ్మత్తు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లేకుండా చేస్తున్నారనే విమర్శ ప్రజల నుంచి వస్తున్నందున పరిశీలించాలన్నారు. విపనకల్ప కాంప్లెక్సు షాపు నిర్మాణానికి టెండర్లు వెంటనే పిలిచే విధంగా చేయాలని కోరారు. మరో సభ్యులు సుంకరి బాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోడ్డు కు ఇరువైపులా షాపులు తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేసిన ప్లానింగ్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. మున్సిపల్ ఇంజినీర్ ప్రసాదరావు నగరంలో పండగ సందర్భంగా జరుగుతున్న పనులు పురోగతిని వివరించారు. నగరంలో ఆవులు, కుక్కలు ఎక్కువగా ఉన్నాయని, వాటివలన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని,వాటిపై దృష్టి పెట్టాలని సభ్యులు అధికారులను కోరారు. రేగాన రూపాదేవి, అల్లు చాణక్య మాట్లాడుతూ తమ వార్డులో శ్మశానవాటికను పరిశీలించి బాగు చేయాలని కోరారు. అనంతరం ఎజెండాలో 21 అంశాలను ఆమోదించారు. వాటిలో ప్రధానంగా అమ్మవారి పండగకు అభివృద్ధి పనులు, లైటింగ్, రోడ్లు మరమ్మత్తు పనులు, తాగునీరు సరఫరా తదితర అభివృద్ధి పనులకు టెండర్లు పిలవాలని, ప్రత్యేక ఎజెండాలో మూడు అంశాలను స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. సమావేశంలో కమిషనర్ నల్లనయ్య, అసిస్టెంట్ కమీషనర్ అప్పలరాజు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

102 సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

రాష్ట్ర వ్యాప్తంగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ (102 వాహనాలు) సర్వీసులలో పనిచేస్తున్న కెప్టెన్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ ఎంప్లాయిస్(102)యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బసవరాజు, దేవి ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గత పదేళ్లగా ఎంతో శ్రమ కోర్చి పనిచేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ సర్వీస్ ఎంప్లాయిస్ పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు .ప్రభుత్వమే తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్(102) సర్వీసులను నిర్వహించి వేతనాలు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అరబిందో కంపెనీ నిర్వహిస్తున్న 102 సర్వీసులలో పనిచేస్తున్న వారికి కేవలం 10 వేల రూపాయలు మాత్రమే వేతనం చెల్లిస్తున్నారని, ఇందులో యజమాని చెల్లించాల్సిన పిఎఫ్ వాటాను కూడా చెల్లించకుండా కార్మికుల వద్ద వసూలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 102 సర్వీస్ సిబ్బంది సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, ప్రతి నెల సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనియెడల 102 సర్వీస్ లలో పనిచేస్తున్న వారిని ఐక్యం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో 102యూనియన్ జిల్లా అధ్యక్షులు రమణ, ఉపాధ్యక్షులు పోలిరాజు, నాయుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు బసవరాజు

సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన మంగళవారం కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి పాల్తేరు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న 4 డిఎలు వెంటనే విడుదల చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని, ఐఆర్ ప్రకంచాలని, బకాయిలు చెల్లించాలని, హెల్త్ కార్డు పరిమితి పెంపుదల చేయాలని, అసెస్మెంట్ బుక్లెట్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు బంకురు జోగినాయుడు ,రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యులు జెసి రాజు, రాష్ట్ర కౌన్సిల్ కర్రి రవి, జిల్లా కార్యవర్గసభ్యులు మర్రాపు శ్రీనివాస రావు, వెంకట్రావు, మద్ది రమేష్ కష్ణమూర్తి, విజయ్ కుమార్ మట్ట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ ఉపాధ్యాయులను రెగ్యులర్ పోస్టుల్లో నియమించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అన్ని యాజమాన్యాల్లో పని చేస్తున్న క్లస్టర్ ఉపాధాయులకు డిఎస్‌సి అంతర్ జిల్లా బదిలీల్లో వచ్చే వారి కంటే ముందుగా శాశ్వత ప్రాతి పదికన స్థానాలను కేటాయించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.జోగారావు, సిహెచ్.సూరిబాబు కోరారు. మంగళవారం ఆర్‌జెడికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయ ఖాళీలను క్లస్టర్‌లో పని చేస్తున్న వారిని నియమిస్తే భవిషత్‌లో వారి స్థానాల్లో సీనియారిటీ కోల్పోకుండా ఉంటారన్నారు.

జెఎన్‌టియు విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు జివి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శిక్షణ ఫౌండేషన్ అధ్వర్యంలో హిటాచీ సంస్థ సహకారంతో 9మంది విద్యార్థినులకు, అంబేద్కర్ విశ్వవిద్యాలయానికి చెందిన 6 గురు విద్యార్థినులకు మంగళవారం ల్యాప్‌టాప్‌లు, బ్యాగ్‌లు ఉచితంగా పంపిణీ చేసారు. ముఖ్య అతిథిగా హాజరైన జెఎన్‌టియుజివి ఇన్‌ఛార్జి ఉప-కులపతి ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినులకు ఇటువంటి ప్రోత్సాహకాలను ఇవ్వడం వల్ల వారిలోని స్కిల్స్‌ను మెరుగు పర్చుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. హిటాచీ సంస్థ వైస్- ప్రెసిడెంట్ మోహన్ కాక్డే , కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్. రాజేశ్వరరావు, శిక్షణ ఫౌండేషన్ ప్రోగ్రాం ఇన్‌ఛార్జ్ మహాలక్ష్మి, మేనేజర్ ఆర్. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సత్య డిగ్రీ కళాశాలలో ముగిసిన వర్క్ షాప్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో మాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ , సత్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి నిర్వహించిన సాఫ్ట్ స్కిల్స్‌పై వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. ఈ శిక్షణను ట్రైనర్ కె.అనూష వివరించారు. ముగింపు సమావేశంలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడానికి, కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపర్చుకునేందుకు శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

అలరించిన గాత్ర కచేరి

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరం లోని తోటపాలెం బాలాజీ నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఏర్పాటుచేసిన అన్నమాచార్య సంకీర్తనల కచేరి శ్రోతలను అలరించింది. ఈ కచేరీలో ప్రముఖ గాత్ర సంగీత విద్వాంసులు తాతాజీ బృందం పలు కీర్తనలను ఆలపించి శ్రోతలను భక్తి పారవశ్యంలో ముంచెత్తారు. అనంతరం అన్నమాచార్య గీతాలకు మహిళల బృందం నిర్వ హించిన కోలా టం ఆకట్టుకుంది. కృష్ణాష్టమి రోజున శ్రీకష్ణ రాధా వేషాలు ధరించి సందడి చేసిన బాల బాలికల కు బహుమతి ప్రదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎంవిఎస్‌సూర్య భగవాన్ ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు చిన్నారులకు బహుమతులను అందజేశారు. కమిటీ చైర్మన్ భగవాన్, ప్రతినిధులు విజయ్ కుమార్, రమణాజీ, శ్రీనివాసరావు, ఎఒ కె.కృష్ణమూర్తి, భీమ్ సింగ్, విజయలక్ష్మి, పార్థసారథి, వెంకటరావు, ఉమా శంకర్, గూడూరు నరసింగ రావు పాల్గొన్నారు.

డిఎస్‌సిలో పారా క్రీడాకారుల ప్రభంజనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఎస్‌సి ఉపాధ్యాయ ఫలితాల్లో 15 మంది పారా క్రీడాకారులు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి పారా (వికలాంగుల) క్రీడలను ప్రోత్సహిస్తూ, స్పోర్ట్స్ పాలసీ -2024 తీసుకురావడం ద్వారా పారా క్రీడాకారుల భవిష్యత్ కు పెద్ద భరోసా నిచ్చిందని అన్నారు. ఈ స్పోర్ట్స్ పాలసీ ద్వారానే 15 మంది వికలాంగుల క్రీడాకారులకు డిఎస్‌సిలో ఉద్యోగాలు కల్పించి వారి ఆత్మ గౌరవాన్ని మరింతగా పెంచిందని అన్నారు. భవిష్యత్ లోనూ వికలాంగ క్రీడాకారుల పట్ల ప్రభుత్వం కలిగి వున్న పెద్ద మనసును కొనసాగించాలని కోరారు.

పాఠశాలకు బీరువా అందజేసిన కస్పా హైస్కూలు ఉపాధ్యాయులు కొల్లి బలరాం

బలరాం మాస్టారు దాతృత్వం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లవేళలా ముందుండే కస్పా హైస్కూలు ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయులు కొల్లి బలరాం మాస్టారు పూల్‌బాగ్ కాలనీలోని ఎంపిపిఎస్ స్కూల్‌కు రూ.10వేలు విలువైన బీరువా, ఒక ఆఫీస్ చైర్ అందజేశారు. ఈ సందర్భంగా బలరామ్‌ను పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.అప్పలరాజు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి చండీ హోమం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉత్తరాంధ్ర కల్పవల్లి పైడితల్లి అమ్మవారి చండీ హోమం మంగళవారం వనం గుడివద్ద ఘనంగా జరిగింది. మూడవ మంగళవారాన్ని పురస్కరించుకొని ఈ హోమాన్ని నిర్వహించారు. ప్రతీ మూడవ మంగళవారం చండీ హోమాన్ని నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఆలయ ఇఒ కె.శిరీష పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో వేద పండితులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సైక్లింగ్, స్కేటింగ్, తైక్వాండో ఎంపికలు పూర్తి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో విజ్జి మైదానంలో సైక్లింగ్, స్కేటింగ్, తైక్వాండో జట్ల ఎంపికలు మంగళవారం జరిగాయి. మూడు విభాగాల్లో పోటీలకు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ ఆధారంగా రాష్ట్ర పోటీలకు జిల్లా క్రీడాకారులను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, ఎస్.విజయలక్ష్మి తెలిపారు.

మహిళలకు రక్షణ కవచం శక్తియాప్

ప్రజాశక్తి- కంటోన్మెంట్

మహిళలకు రక్షణ కవచంగా ఉండే శక్తియాప్‌ను ప్రతి ఒక్కరూ అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకోవాలని మహిళా పోలీసు స్టేషన్ డిఎస్‌పి ఆర్.గవిందరావు అన్నారు. నగరంలోని పూల్‌బాగ్ కాలనీలో గల కస్తూరి గాంధీ బాలిక విద్యాలయంలో విద్యార్థినులకు శక్తి యాప్ పట్ల, గుడ్ టచ్- బ్యాడ్ టచ్ గురించి మంగళవారం అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిఎస్‌పి మాట్లాడుతూ శక్తి మొబైల్ యాప్ ఏ విధంగా డౌన్లోడ్ చేయడం, దాని పని తీరును వివరించారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తుల వాహనాలు, ఆటోల్లో ప్రయాణించినపుడు సేఫ్ ట్రావెల్ ఆప్షన్స్ క్లిక్ చేసి, చేరుకోవాల్సిన ప్రాంతాన్ని నమోదు చేస్తే, వారు సురక్షితంగా గమ్య స్థానానికి చేరుకొనేంత వరకు వారి ప్రయాణంపై పోలీసులు నిఘా పెడతారన్నారు.18ఏళ్ల నిండకుండా అమ్మాయిలు ఇష్ట పూర్వకంగా వ్యవహరించినా, వేధించినా, వెంటపడినా పోక్సో చట్టం కింద నేరంగానే పరిగణిస్తారన్నారు. విద్యార్థులు గంజాయి, ఇతర మత్తు, మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దని, జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ శిరీష, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పి4 అమలుకు సచివాలయ సిబ్బందే వారధులు

జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పేదరిక నిర్మూలనే పి4 కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ స్పష్టం చేశారు. మార్గదర్శులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని, వారిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చేవిధంగా కృషి చేయాలని కోరారు. పి4 కార్యక్రమం, బంగారు కుటుంబాలు, మార్గదర్శుల పాత్రపై, సచివాలయ సిబ్బంది నుంచి ఎంపిక చేసిన ఎంఒటిలు, టిఒటిలకు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పి4 కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. మార్గదర్శులు పేద కుటుంబాలను వ్యక్తిగతంగా దత్తత తీసుకొని, పేదరికం నుంచి వారు శాశ్వతంగా బయట పడేవిధంగా చైతన్య పరచడం, అవసరమైన విద్య, ఇతరత్రా సహకారాన్ని అందించడం చేయాల్సి ఉంటుందన్నారు. పి4 కార్యక్రమంలో సచివాలయ సిబ్బందిది కీలక పాత్ర అని, బంగారు కుటుంబాలకు, మార్గదర్శులకు మధ్య వారు వారధి వంటివారని జెసి పేర్కొన్నారు. పేదరిక నిర్మూలనలో ప్రజల్ని భాగస్వాములను చేస్తూ, దేశంలోనే మొట్టమొదటిసారిగా అమలు జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో అమలు చేసి విజయవంతం చేయాలని జెసి పిలుపునిచ్చారు. సిపిఒ పి.బాలాజీ మాట్లాడుతూ, సచివాలయ సిబ్బంది నుంచి మండలానికి ఇద్దరు మాస్టర్ ఆఫ్ ట్రైనీలను, 12 మంది టిఒటిలను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. పి4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాల అవసరాలను గుర్తించి, వాటిని మార్గదర్శుల ద్వారా తీర్చేందుకు అవసరమైన సూచనలను అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం కోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ముఖ్యప్రణాళికా శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, స్వర్ణాంధ్ర పి4 కార్యక్రమం కన్సల్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి సేతు మాధవన్

అందరూ భాగస్వామ్యం కావాలి : డిసిసిబి చైర్మన్

ప్రజాశక్తి - చీపురుపల్లి

డిసిసిబి అనేది ప్రజలందరి బ్యాంకు అని అభివృద్ధిలో విద్యార్థులు, యువత, మహిళలు అందరూ భాగస్వామ్యం కావాలని జిల్లా డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం డిసిసిబి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులంతా డిసిసిబి బ్యాంకులో ఖాతాలను తెరవాలన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 24 డిసిసిబి బ్యాంకు శాఖలున్నాయనీ తెలిపారు. ఒకపక్క రైతుల శ్రేయస్సు, మరో పక్క అభ్యున్నతి కోసం పని చేస్తున్నాయన్నారు. వాణిజ్య బ్యాంకులకు మించి డిసిసిబి ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వంలో బ్యాంకును అన్ని విధాలుగా ముందుకు నడిపించి ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. డిసిసిబి ప్రజల భాగస్వామ్యంతో అండదండలతో నడుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమేష్, బ్యాంకు సిఇఒ ఉమామహేశ్వర రావు, జిల్లా మేనేజర్ వాసు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిసిసిబి చైర్మన్ నాగార్జున

ఐటిఐ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలోని 3 ప్రభుత్వ , 25 ప్రైవేటు ఐటిఐలలో నాలుగో విడత ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ఐటిఐ కన్వీనర్ టివి గిరి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు iti.ap.gov.in వెబ్సైట్ ద్వారా అభ్యర్థి ఈనెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత వచ్చిన యూనిక్ నెంబర్‌తో 28వ తేదీ మధ్యాహ్నం 2గంటల లోపు వరకు దగ్గరలో ఉన్న గవర్నమెంట్/ ప్రైవేట్ ఐటిఐకి ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొని వెళ్లి వెరిఫికేషన్ ప్రాసెస్ కంప్లీట్ చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వఐటిఐలో 29న, ప్రైవేట్ ఐటిఐల లో 30న కౌన్సిలింగ్ జరుగుతుందని తెలిపారు. వివరాలకు 9849118075, 9849944654, 7780658035 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

మ్యూజిక్ అకాడమీలో ఎంఎస్ సుబ్బలక్ష్మి జయంతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని కొత్తగ్రహారంలో గల రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీలో మంగళవారం భారతరత్న ఎం.ఎస్.సుబ్బులక్ష్మి 109వ జయంతిని నిర్వహించారు. అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి సుబ్బులక్ష్మి జీవిత విశేషాలు తెలియజేశారు. వారు దేశ విదేశాలలో అనేక కచేరీలు చేసి ప్రముఖుల మన్ననలను పొంది, అనేక మంది శిష్యులను తయారు చేశారన్నారు. మనం నిత్యం వినే వెంకటేశ్వర సుప్రభాతం, విష్ణు సహస్రనామ స్తోత్రం, అనేక భాషలలో కృతులు, కీర్తనలు ఆలపించిన ఆమె భారత ప్రభుత్వ అత్యున్నత పురస్కారం భారతరత్న అందుకున్నారని తెలిపారు. అకాడమీ సభ్యులు శారద, మురళీకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరోగ్య శిబిరాలు

ప్రజాశక్తి- డెంకాడ

సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు మండలంలో పలు గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని వైద్యాధికారి ఎం. శివరామ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా తొలిరోజు బుధవారం అక్కివరం గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. గ్రామాల్లో ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాల కోసం ఈ ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామ న్నారు. మహిళలలో ఎక్కువగా రక్తపోటు, మధు మేహం, నోటి కేన్సర్, రొమ్ము, గర్భాశయ కేన్సర్, కిషోర బాలికల ఆరోగ్య పరీక్షలు, టీవీ వ్యాధి స్క్రీనింగ్, వయోవృద్ధుల ఆరోగ్య పరీక్షలు, మానసిక వైద్య సేవలు, ఆయుష్ సేవలు అందిస్తామన్నారు. ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

జాతీయ ఇఫ్కో బోర్డు సమావేశంలో కర్రోతు

భోగాపురం: జాతీయ ఇఫ్కో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో జాతీయ ఇఫ్కో డైరెక్టర్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఎరువుల సరఫరా, రైతు సంక్షేమ కార్యక్రమాలు, సహకార సంఘాల బలోపేతం వంటి పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన ఎరువులు సకాలంలో అందించేందుకు ఇఫ్కో ఎల్లప్పుడూ కృషి చేస్తుందని, సహకార వ్యవస్థను మరింత బలపర్చే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు.

శివ్వాంలో పారిశుధ్య పనులు

వంగర: మండలంలోని శివ్వాంలో సర్పంచ్ బొత్సల లక్ష్మీనారాయణమ్మ ఆధ్వర్యంలో మంగళవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామం నుండి నాగావళి నదికి వెళ్లే ప్రధాన కాలువ, సచివాలయం వైపు ఉన్న కాలువల్లోని పేరుకుపోయిన పూడికలను తొలగించారు. ఈ పనులను గ్రామ నాయకులు బొత్సల వెంకట అప్పలనాయుడు, గారాల రఘురామ నాయుడు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పరిశీలించారు.

'మన డబ్బులు..మన లెక్కలు'పై అవగాహన

నెల్లిమర్ల: మండలంలోని మధుపాడ గ్రామంలో మంగళవారం మన డబ్బులు మన లెక్కలుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ పేదరిక నిర్మూలనపై పైలెట్ గ్రామంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వెలుగు ద్వారా పథక సంచాలకుల ఆదేశంతో స్వయం సహాయక సంఘ మహిళలకు డిజిటల్ లిటరసీ, సంఘ ఆర్థిక లావాదేవీలపై అవగాహన (మన డబ్బులు మన లెక్కలు) యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపిఎం ఎస్.వి.డి. సురేష్ మాట్లాడుతూ మన డబ్బులు మన లెక్కలు యాప్‌ను పైలెట్ గ్రామంగా మధుపాడ సంఘంను ఎంపిక చేశామన్నారు. గ్రామంలో అన్ని సంఘాలకు యాప్ డౌన్‌లోడ్ పై అవగాహన కల్పించామన్నారు. ఈ ప్రత్యేక సమావేశానికి విఓలు, స్వయం సహాయక సంఘ సభ్యులు, బ్యాంకు సిబ్బంది ఎలిసి నర్సింగరావు, ఈనాటి సుజాత, పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు ఇవ్వాలి : బేబినాయన

బొబ్బిలి: వ్యాపారులు, డ్వాక్రా గ్రూపులకు రుణాలు సకాలంలో ఇవ్వాలని బ్యాంకర్లను ఎమ్మెల్యే బేబినాయన కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం బొబ్బిలి నియోజకవర్గంలో ఉన్న బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో బ్యాంకర్లు, ప్రభుత్వ అధికారులు మధ్య సమన్వయం ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలు అమలయ్యేలా బ్యాంకర్లు చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో బ్యాంకర్లు, అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబర్క శరత్, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, నియోజకవర్గ పరిధిలో ఉన్న బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ పనులు పరిశీలన

గంట్యాడ: మండలంలోని తాటిపూడిలో కీర్తిశేషులు గొర్రిపాటి బుచ్చిఅప్పారావు విగ్రహావిష్కరణ చేయడానికి చేపట్టిన పనులను మంగళవారం తాటిపూడి ఆయకట్టు కమిటీ చైర్మన్ కల్లెంపూడి జగన్నాథం, టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చేనెల 13వ తేదీన విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందని తొందరగా పనిని పూర్తి చేయాలని చెప్పారు.

డ్రీమ్స్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థులు ఎంపిక

రామభద్రపురం: మండల పరిధిలోని పాతరేగ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రేమ్ ఫౌండేషన్ ద్వారా గ్రామ్యయిట్ డ్రీమ్స్ స్కాలర్ షిప్స్‌కు ఎంపికయ్యారు. మంగళవారం రాధ, కొన బోను కావ్యలకు నెలకు వెయ్యి రూపాయలు చొప్పున డిగ్రీ పూర్తయ్యేవరకు ఈ ఉపకార వేతనాలు అందిస్తారు. ఈ స్కాలర్ షిప్పుకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం చప్ప రవణ, ఉపాధ్యాయులు సింహాచలంలు అభినందించారు.

పెట్రోల్ బంకుకు స్థల పరిశీలన

బొబ్బిలి: సబ్ జైలు ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు నిర్మాణానికి మంగళవారం ఆర్‌డిఒ రామ్మోహనరావు స్థలాన్ని పరిశీలించారు. జైలులో ఉన్న రిమాండ్ ఖైదీలతో పెట్రోల్ బంకు నిర్వహణకు జైలు శాఖ చర్యలు చేపట్టింది. జైలు ముందున్న స్థలంలో పెట్రోల్ బంకు నిర్మాణ సాధ్య అసాధ్యాలపై పరిశీలన చేసి నివేదిక అందిస్తామని ఆర్‌డిఒ చెప్పారు. ఆయనతో తహశీల్దార్ శ్రీను, సబ్ జైలు సిబ్బంది ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

పూసపాటిరేగ: మండలంలోని వెంపడాం గ్రామానికి చెందిన ఐనా సతీష్ (29) మంగళవారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసుల సమాచారం ప్రకారం, సతీష్ పూసపాటిరేగ టోల్‌ప్లాజా ఎదుట ఉన్న వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఉదయం 9 గంటల సమయంలో వాహనానికి సర్వీసింగ్ చేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. సహోద్యోగి దుర్గాప్రసాద్, యజమాని ఇమ్మిరోతు రాజారావు తక్షణమే అతన్ని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని అన్న రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైకును ఢీకొన్న ట్రాక్టర్.. ఇద్దరికి గాయాలు

వంగర: బైకును ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని చంద్రంపేట పరిధిలో మంగళవారం చోటుచేసుకుందని ఎస్‌ఐ షేక్ శంకర్ తెలిపారు. మండలంలోని కింజంగి గ్రామానికి చెందిన వేమిరెడ్డి మురళీకృష్ణ, తన తమ్ముడు వేమిరెడ్డి గణేష్‌రావు పని నిమిత్తం బైక్‌పై విజయనగరం వెళ్లి తిరిగి ప్రయాణంలో వస్తుండగా చంద్రంపేట సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని ట్రాక్టరు అతివేగంగా వచ్చి బైకును ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరుకూ గాయాలయ్యాయి. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

దొంగకు జైలు శిక్ష

కంటోన్మెంట్: రైళ్లలో దొంగతనాలకు పాల్పడి పట్టుబడిన నిందితుడు శరత్ దినాలకు 5 నెలల 15 రోజులు జైలు శిక్ష విధిస్తూ విశాఖపట్నం రైల్వే కోర్ట్ మెజిస్ట్రేట్ కార్తిక్ మంగళవారం తీర్పు వెల్లడించారు. గత ఏడాది రైలులో ప్రయాణిస్తున్న ప్రయాణికుడి నుంచి సెల్ ఫోన్ దొంగతనం జరగగా విజయనగరం జిఆర్‌పి ఎస్‌ఐ వి.బాలాజీరావు కేసు నమోదు చేసి దర్యాప్తులో ఒడిశా రాష్ట్రం కాందమాల్ జిల్లా ఉదయగిరి మండలం, హెట్టిబాసిపాహి గ్రామానికి చెందిన శరత్ దినాల్‌ను అరెస్ట్ చేసి సెల్ ఫోన్‌ను రికవరీ చేసి కోర్టులో ఛార్జ్ షీట్ వేశారు. నేరం రుజువు కావడంతో శిక్ష విధించారు.

జొన్న వలసలో భారీ దొంగతనం

కంటోన్మెంట్: విజయనగరం మండలంలోని జొన్నవలస గ్రామంలో మంగళవారం ఓ ఇంట్లో భారీ దొంగతనం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలో నివాసముంటున్న బి.ఆదిలక్ష్మి కుటుంబ సభ్యులు వారాల పండగ నేపథ్యంలో ఇంటి నుంచి గ్రామంలోకి వెళ్లారు. ఈ సమయంలో ఇంట్లో ఉన్న సుమారు పది తులాల బంగారు ఆభరణాలు దొంగిలించారు. దీంతో బాధితురాలు ఆదిలక్ష్మి విజయనగరం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలం : వైసిపి

ప్రజాశక్తి - గజపతినగరం

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

రైతులకు యూరియా పంపిణీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అన్నదాతల కష్టానికి ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకపోవడమే ప్రధాన కారణమని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం పిఎసిఎస్ వద్ద జరిగిన తోపులాటలకు వైసిపి నేత ప్రధాన కారణం అన్న టిడిపి నాయకుల ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. పిఎసిఎస్ వద్ద తెల్లవారుజాము నుంచి పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు పట్టుకుని గంటల తరబడి నిలబడటంతో కొంత మంది ఎండలో స్పృహ తప్పిపోయి పడిపో యారని, మరి కొంతమందికి క్యూలైన్‌లో నిలుచున్నప్పటికీ యూరియా దొరకడం లేదని పలువురు రైతులు తనకు ఫోన్ చేసి చెప్పడంతోనే బాధ్యతాయుత నాయకుడిగా అక్కడ పరిస్థితులను పరిశీలించడానికి వెళ్లానని జెడ్‌పిటిసి గార తవుడు చెప్పారు. దీనికి టిడిపి నేతలు తనను నిందించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

యూరియా కొరతపై సభ్యుల ధ్వజం

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలో యూరియా కొరతపై సభ్యులు పెద్ద ఎత్తున ధ్వజమెత్తారు.. కూటమి ప్రభుత్వం రైతులకు సకాలంలో ఎరువులను అందించడంలో విఫలమైందని ఆగ్రహించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వైస్ ఎంపిపి సారిక ఈశ్వరరావు, ఇద్దన వలస సర్పంచ్ రాయిపిల్లి రామారావు, మెంటాడ ఎంపిటిసి పతివాడ కుమారి మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా ఖరీఫ్ పంటకు యూరియా పంపిణీ సరైన ప్రణాళిక లేకపోవడంతో రైతులలో ఆందోళన నెలకొని హింసలకు తావు తీసిందని ఇది కచ్చితంగా అధికారుల నిర్లక్ష్యమని ఎఒ గోకుల్ కృష్ణను నిలదీశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ మండలంలోని ప్రతి రైతుకూ వన్ బి ఆధారంగా ఒక బస్తా చొప్పున యూరియా అందుబాటులో ఉంచుతున్నామని అన్నారు. ఎఎంసి చైర్మన్ సూర్యనారాయణ జోక్యం చేసుకుని రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడడం అధికారుల నిర్లక్ష్యమేనని మరొకసారి ఈ విధంగా జరగకుండా తగు ప్రణాళిక రూపొందించుకుని పంపిణీ కార్యక్రమం చేపట్టాలని అవసరమైతే ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని సూచించారు. పిఆర్ జెఇ గౌతమ్ మాట్లాడుతూ మండలంలో 88 పనులను పూర్తి చేసామని వాటికి సంబంధించి రూ.1.10కోట్లు బిల్లులు చేశామని, మిగతా రూ.1.20 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. పోరాం, జయితి, జక్కువ, మెంటాడ, జిటి పేట గ్రామాలలో కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు వేశామని ఎలక్ట్రికల్ జెఇ తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి దుర్గ, ఎంపిడిఒ భానుమూర్తి, తహాశీల్దార్ అరుణకుమారి, అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఏడాదిలో రెండుసార్లు బోనస్‌లు

ప్రజాశక్తి- గంట్యాడ

మాట్లాడుతున్న హెరిటేజ్ ప్రతినిధి

హెరిటేజ్ ఒక సంస్థ కాదని 2017వ సంవత్సరంలో కంపెనీ ప్రైవేటు లిమిటెడ్‌గా ఎదిగిందని హెరిటేజ్ పిన్‌లీస్ సిఇఒ చంద్రమౌళి అన్నారు. మండలంలోని పెంట శ్రీరాంపురంలోని హెరిటేజ్ పాల కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. అనంతరం సప్ప సూరిబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలు పోసిన ఐదు నిమిషాలలో ఆన్‌లైన్ అవుతుందని సంవత్సరానికి రెండు పర్యాయాలు బోనస్‌లను ఆన్‌లైన్‌లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు. 12 రాష్ట్రాలలో హెరిటేజ్ అభివృద్ధి చెందిందని అన్నారు. హెరిటేజ్ డైరీ రీజనల్ కోఆర్డినేటర్ తులసి నాయుడు పశువులను సంరక్షించే విధానం, అత్యధిక పాల శాతం పెంపు విషయాలపై రైతులకు వివరించారు. అనంతరం ఉత్తమ రైతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గులిపల్లి జైపాల్‌రావు, గొర్లె దేవి, ఫిల్లింగ్ సెంటర్ మేనేజర్ షేక్ మహబూబ్, ప్లాంట్ మేనేజర్ డాక్టర్ మోహన్ రైతులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల బంద్ జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆటో కార్మికులు

ఆటో కార్మికుల బంద్‌ను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన జరజాపుపేట, మొయిద, రామతీర్థం జంక్షన్‌లో ఆటో డ్రైవర్ల బంద్‌కు మద్దతు తెలుపుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న జరిగే ఆటో కార్మికుల బంద్‌కి అన్ని వర్గాలూ మద్దతు పలికి జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వం ఉచిత బస్ పథకం ప్రవేశపెట్టడంతో ఆటో కార్మికులు ఉపాధి పోయి రోడ్డున పడ్డారని తెలిపారు. పెరుగుతున్న ఆయిల్ ధరలు, కేసులతో ఇబ్బందులు పడి ఆటో కార్మికులు ఆటోని నడిపి తమ కుటుంబాలను పోషించుకొనే మార్గం కరువైందన్నారు. ప్రభుత్వం ఆటో కార్మికులకు 15వేలు ఇచ్చి చేతులు దులుపుకోవడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కె. పద్మనాభం, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

రామభద్రపురం: మహిళలకు ఉచిత బస్సులు ప్రవేశపెట్టిన కారణంగా రోడ్డును పడ్డ ఆటోవాలాలకు ప్రత్యామ్నాయం కల్పించాలని కోరుతూ బుధవారం జరపనున్న జిల్లా బంద్‌ను విజయవంతం చేయాలని సిఐటియూ మండల నాయకులు బలస శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో వాలాలకు ఏటా రూ.25వేలు ఇవ్వాలని, జీవో నెంబర్ 21, ఈ చలానా, ఆర్‌టిఒ వేధింపులు, ప్రైవేట్ ఫిట్నెస్ సెంటర్ రద్దు వంటి అంశాలు నెరవేర్చాలని కోరారు. అనంతరం ఆ సంఘ కార్మికుల ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు చొక్కాపు లోకేష్, సంజీవ్, గంగయ్య, వెంకటరమణ, సోములు, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ రోడ్డు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- భోగాపురం

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవి

రహదారులు బాగున్నపుడే ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని, ప్రతి గ్రామానికీ రోడ్డు వేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. గత ప్రభుత్వం ఒక్క రోడ్డు కూడా నిర్మించకుండా కాలయాపన చేసిందని ఆరోపించారు. మంగళవారం మండలంలోని ముక్కాం అర్అండ్‌బి రోడ్డు నుంచి తోటపల్లి మీదుగా కంచేరు అర్అండ్‌బి రోడ్డు వరకూ తారు రోడ్డు నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ముక్కాం నుంచి బమ్మిడిపేట మీదుగా కంచేరు వరకు, ముక్కాం నుంచి అమటాం మీదుగా కవులవాడ వరకూ, భోగాపురం జాతీయ రహదారి-16 నుంచి చాకివలస మీదుగా ముగడపేట వరకు తారు రోడ్ పనులను ఆమె ఈ సందర్భంగా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపడుతోందన్నారు. అందులో భాగంగానే రూ.3కోట్లు నాబార్డు నిధులతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అనంతరం మహారాజ్‌పేటలో జనసైనికులు స్వయంగా నిధులు సమకూర్చి నిర్మించిన వీధి కాలువను ప్రారంభించారు. ఈ కార్యక్రమలో ఎంపిడిఒ కె. గాయత్రి, డిఇ శ్రీనివాసరావు, జనసేన పార్టీ అధ్యక్షుడు వందనాలు రమణ, భోగాపురం, గూడెపువలస సర్పంచులు ఊడికిల అప్పయ్యమ్మ, మట్టా అయ్యప్ప రెడ్డి, సీనియర్ నాయకులు పడాల శ్రీనివాసరావు, పల్లంట్ల జగదీష్, పల్లా రాంబాబు, గుండపు సూరి, బొల్లు త్రినాధ్, మాతా నవీన్, వరుపుల గిరి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం వేణుగోపాలరావు

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు కొండగుంపాం విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం కొండగుంపాం జడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్ ఎం.వి. వేణు గోపాలరావు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండ వెలగాడ జిమ్ ఆవరణలో జిల్లా స్థాయిలో జరిగిన అండర్ 14 విభాగం కుస్తీ పోటీల్లో పాఠశాలకి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి అదపాక ఎర్రబాబు, అండర్ 17 విభాగంలో 10వ తరగతి విద్యార్థి శనపతి ధర్మేంద్ర రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వేణుగోపాల రావు, పిఇటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మంగళవారం కొండగుంపాం జడ్‌పి ఉన్నత పాఠశాలలో ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నీటి పై ప్రకృతి ఆధారపడటం, ప్రతి నీటి బిందువు విలువ అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 8వ తరగతికి చెందిన ఎం.మేఘాలు ప్రథమ, 9వ తరగతికి చెందిన అమృత ద్వితీయ, అదే తరగతికి చెందిన పి. శ్యామ్‌కుమార్ తృతీయ బహుమతులు సాధించారు. వీరిని హెచ్‌ఎం వేణుగోపాల్ అభినందించారు.

సేవా భావంతో రహదారి నిర్మాణం

ప్రజాశక్తి - చీపురుపల్లి

రోడ్డును బాగు చేసుకుంటున్న యువత

పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ రైల్వే స్టేషన్‌లకు చేరడానికి అవసరమైన ప్రధాన రహదారి మరమ్మత్తులను పోలీస్, పంచాయతీ అధికారులు సంయుక్తంగా నిర్వహించడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ స్టేషన్ రోడ్డు నిత్యం గతుకులమయం కావడంతో పోలీస్ స్టేషన్‌తో పాటు రైల్వే స్టేషన్ అడ్డూరు వీధి, తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రజలు అవస్థలకు గురయ్యేవారు. ప్రధానంగా ఈ రహదారిలో కోఆర్డిటు మైనింగ్ సంబంధించిన మెరక ముడుదాం, దత్తిరాజేరు మండలాల నుంచి భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుండటంతో రహదారి పూర్తిగా గతుకుల మయంగా మారింది. ఈ మైనింగ్ వ్యాపారాలతో కోట్లాది రూపాయలు సంబంధిత యాజమాన్యాలు సంపాదించుకుంటున్నప్పటికీ మరమ్మతులకు గురైన రహదారి కోసం కనీసం పట్టించుకోకపోవడంతో స్థానికంగా పోలీసులు పంచాయతీ అధికారులు ప్రజల అవస్థలను గుర్తించి సేవా భావంతో మరమ్మతు పనులను చేపట్టారు. చీపురుపల్లి ఎస్ఐ ఎల్ దామోదర్‌రావుతో పాటు సిబ్బంది, చీపురుపల్లి మేజర్ పంచాయతీ సానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, సూపర్‌వైజర్ నాసిక రాము, పంచాయతీ సిబ్బంది మంగళవారం రోడ్డునకు ఇరువైపుల గల కాలువలలో పేరుకుపోయిన చెత్త నిల్వలను తొలగించారు. రహదారి గోతులను పూడ్చి ప్రజలకు ఇబ్బంది లేకుండా పూర్తి స్థాయిలో మరమ్మత్తులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో పోలీస్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జామి మండలం విద్యుత్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నల్ల బ్యాడ్జిలు ధరించి మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ జెఎల్ఎం గ్రేడ్ 2 ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, పెండింగ్ ఉన్న కారుణ్య నియామకాలను అమలు పరచి ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలిక సమస్యల సాధన కోసం చేస్తున్న పోరాటానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే దశలవారీగా ఆందోళన చేపడతామన్నారు.

డ్రోన్‌తో స్ప్రేయింగ్ ప్రయోగం

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని కనిమెరక గ్రామ పరిధిలో డ్రోన్ సహాయంతో జీవామృతం, కషాయాలు స్ప్రేయింగ్ చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎఒ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి సాంకేతిక వ్యవసాయ పద్ధతులపై డ్రోన్ ద్వారా జీవామృతం, కషాయం స్ప్రేయింగ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. రైతులకు వ్యవసాయంలో పెట్టుబడి తగ్గి ఆదాయం సమకూర్చేందుకు సాంకేతిక పరికరాలపై దృష్టి సారించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి సిఎన్ఎఫ్ వ్యవసాయ అధికారులతో పాటు ఎడిపిఎం స్వామినాయుడు, రీజనల్ కోఆర్డినేటర్ హేమసుందర్, వ్యవసాయ విస్తరణ అధికారులు సంతోష్, సాయి బిందు, మహేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: డ్రోన్‌తో కషాయాల పిచికారీ రైతుకు లాభదాయకమని డిపిఎం ఆనంద్ రావు తెలిపారు. మండలంలోని సంతగైరమ్మ పేట, వినాయకపల్లి గ్రామాల్లో డ్రోన్‌తో కషాయాలు పిచికారిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ ఆధునిక పరిజ్ఞానం వైపు మారాలని వ్యవసాయంలో యాంత్రీకరణ వల్ల రైతుకు లాభదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ పి.కోటిబాబు, యూనిట్ ఇంచార్జ్ కృష్ణ, చరణ్, ఐసిఆర్‌పి రామలక్ష్మి రైతులు పాల్గొన్నారు.

కల్వర్టు కూల్చివేత అడ్డగింత

ప్రజాశక్తి- శృంగవరపు కోట

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా గల వీధి కల్వర్టును కాంట్రాక్టర్‌కు సంబంధించిన మనుషులు, ఇతర అధికారులు కూల్చేందుకు మంగళవారం సిద్ధం కాగా స్థానికులు అడ్డుపడ్డారు. నెలన్నర రోజుల క్రితమే కల్వర్టు కూల్చారని, పునర్నిర్మించి కనీసం రెండు వారాలు కూడా కాలేదని, మరలా కూల్చేస్తామంటే అంగీకరించమంటూ స్థానికులు ఆందోళన చేపట్టారు. కల్వర్టు నిర్మించి పంచాయతీ, కాంట్రాక్టర్ బిల్లు చేసుకున్నారని, ఇపుడు ఆర్అండ్‌బి, మరో శాఖ, కాంట్రాక్టర్ కలిసి బిల్లు చేసుకుంటారా అని ప్రశ్నించారు. ప్రజలు పన్నులు చెల్లిస్తేనే ప్రభుత్వ ఖజానా నిండుతుందని, ఎన్నిసార్లు కడతారు? ఎన్నిసార్లు విరగ్గొడతారు? మళ్ళా ఎన్నిసార్లు కడతారు? ప్రజల సొమ్మును ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా ఖర్చుచేయాలే గాని ఆలోచన లేకుండా యిష్టానుసారం వృథా చేయకూడదని న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ నిలదీశారు. వీధికి ఒకటే మార్గం ఉందని, పది అడుగులు వెడల్పు మేర కాలువ తవ్వేస్తే వీధిలో ఉన్న ఇరవై కుటుంబాలు నిత్యావసరాలు తెచ్చుకునేందుకు కూడా మార్గం లేక అవస్థలు పడతారని, గతంలో నెల రోజులు అవస్థలు పడ్డారని ఇటువంటి పరిస్థితులు పదే పదే పునరావృతం కావడం వల్ల కనీస హక్కులను కాలరాయడమేనని అన్నారు. కాంట్రాక్టర్ రెడ్డి వెంకన్న కుమారుడు శ్రీహరి నాలుగు రోజుల్లో కల్వర్టు నిర్మాణం పూర్తిచేస్తామని, అంతవరకూ కాలువ దాటేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని హామీ ఇవ్వడంతో స్థానికులు ఆందోళన విరమించారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని ఏరియా హాస్పిటల్‌లో అవుట్ పేషెంట్ విభాగంలో ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ నిధులతో కొనుగోలు చేసి ఏర్పాటు చేసిన కుర్చీలను ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పర్యటిస్తూ ప్రజలకు అందుతున్న సేవలు గురించి వారిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి వైద్యుల కోసం పలు అభివృద్ధి పనులకు, ఇతర వైద్య సేవల నిమ్మితం పలు రకాల పనులకు ఆమోదం తెలిపారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల ప్రజలకే కాకుండా పక్కనే ఉన్న అరకు, అనంతగిరి మండలాల ప్రజలందరికి కూడా మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్ర శేఖర్, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపిపి నానిగిరి రమణాజీ, పట్టణ పార్టీ అధ్యక్షులు మల్లేశ్వర రావు, ఉపాధ్యక్షులు సాయిరాం, జనసేన నాయకులు రవి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లెండీలో ఎఫ్‌డిపి ప్రారంభం

ప్రజాశక్తి- డెంకాడ

లెండి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఎఐసిటిఇ అట్ల అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఎఫ్‌డిపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'అధునాతన మానవ రోబోట్, డిజిటల్ సాంకేతికతల ద్వారా స్మార్ట్ తయారీ, వికసిత్ భారత్ వైపు ఒక అడుగు' అనే అంశంపై జాతీయ స్థాయి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డిపి) నిర్వహించారు. ఐదు రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమంలో హ్యూమన్ రోబోట్ కలయిక, డిజిటల్ ట్విన్స్, ఎఆర్, విఆర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతికతల ప్రాధా న్యతపై చర్చించారు. ఇవి విద్యా రంగంలో కొత్త బోధనా పద్ధతులను అందించడంతో పాటు పరిశ్రమలో ఉత్పాదకతను పెంచి ఖర్చులను తగ్గిస్తాయని, స్మార్ట్ సిటీస్, స్మార్ట్ హెల్త్‌కేర్ వంటి రంగాలలో నాణ్యమైన జీవన ప్రమాణాలను మెరుగుప రుస్తాయని వక్తలు అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమా నికి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ సతీష్ పుజారి సమన్వయకర్తగా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్ కుమార్ ఇంకులు సహ సమ న్వయకర్తగా వ్యవహరించారు. చైర్మన్ పి.మాధుసూ దనరావు, వైస్ చైర్మన్ పి.శ్రీనివాసరావు, సెక్రటరీ కె.శివరామ కృష్ణ మార్గదర్శకత్వంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వివి రామ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ (అడ్మిన్) డాక్టర్ టి. హరిబాబు, వైస్ ప్రిన్సిపల్ (అకాడమిక్) డాక్టర్ వి.అంజిరెడ్డి మెకానికల్ డిపార్ట్మెంట్‌ను అభినందించారు.

ఘనంగా ఓజోన్ దినోత్సవం

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ, సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులు వానపల్లి జగన్నాథం అధ్యక్షతన నిర్వహించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పులిబంటి సన్యాసిరావు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు బంటు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు ఓజోన్ ఆకారంలో గొలుసుగా ఏర్పడి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ కాటపల్లి రామప్రసాద్, పీడీ గోవిందరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని జొన్నాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ డేను పురస్కరించుకొని విద్యార్థులు ఓజోన్ ఆకృతిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. లక్ష్మి, ఉపాధ్యాయ బృందం పాల్గొని ఓజోన్ పొర ప్రాధాన్యత, పరిరక్షణకు సంబంధించిన ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

గొడుగులతో విద్యార్థుల ర్యాలీ

శృంగవరపు కోట: మండలంలోని కొట్టాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివి రాంకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు వర్రి భాస్కరరావు మాట్లాడుతూ ఓజోన్ పొర ఏ విధంగా నాశనం అవుతున్నది వివరించారు. అనంతరం ఓజోన్ పొరను రక్షించాలి అనే నినాదంతో కొట్టాం విద్యార్థులు గొడుగులు వేసుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ వర్రి భాస్కరరావు, ఉపాధ్యాయులు రహీమ్ షేక్ లాల్, డివి సూర్యనారాయణ, ఎం.విశ్వనాధరావు, చిప్పాడ శ్రీను, స్వప్న, గోపి, ఉగ్గిన శ్రీను, బంగారునాయుడు, పి.భాస్కర్, సింహాచలం నాయుడు, తీడ శ్రీను, సిబ్బంది శివప్రసాద్, సంతోష్ విద్యార్థులు పాల్గొన్నారు.

విజయనగరం కోట : ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నారాయణ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. మంగళవారం స్థానిక నారాయణ పబ్లిక్ స్కూల్లో అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉపాధ్యాయులు పిల్లల పలకలపై సేవ్ ఓజోన్‌పొర అని రాసి ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు ఓజోన్ పొర పరిరక్షణ, భూమిపై జీవ జలానికి రక్షణ కవచం అనే అంశంపై పోటీలు నిర్వహించారు. విజేతలకు స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్ర పుస్తకాలను కరస్పాండెంట్ నారాయణరావు ఉపాధ్యాయుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యుని నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిపైకి చేరకుండా ఓజోన్ పొర కాపాడుతుందన్నారు. దీన్ని పరిరక్షించుకొని సూర్యరశ్మి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల నుంచి కాపాడుకోవాలని అన్నారు.

ఓజోన్ పొరను రక్షించాలని కోరుతున్న విద్యార్థులు

బంగార్రాజును కలిసిన డైరెక్టర్లు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని పోలిపల్లి తన స్వగ్రామంలో ఎపి మార్కెఫెడ్ చైర్మన్, టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజును పలు నామినేటెడ్ పోస్టులకు సంబంధించిన డైరెక్టర్లు మంగళవారం కలిసారు. ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన చీకటి సుహాసిని, రాష్ట్ర నగరాల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పిల్ల సూరిబాబు, ఎఎంసి డైరెక్టర్లుగా పిన్నింటి రామకృష్ణ, దీపిల్లి బంగారమ్మ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి ధన్యవాదాలు తెలిపారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి డి. సత్యవంతుడు అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు సమయానికి పాల్గొనాలని కోరారు.

శ్రీ మహారాజశ్రీ విజయనగరం ఫ్యామిలి జడ్జివారి కోర్టులో
IA 399/2025 OS 42/2014

Between :
Surabattula Venkata Rama Rao @ Rambabu ......Plaintiff
And:
Surabattula Sanjeeva Rao and others ....Defendants/Respondents

Notice to :-
R8) Sankabattula Murali, S/o late Satyanarayana, Hindu, Backside of State Bank India, Contonment, Duppada Village, Vizianagaram Mandalam & Dist.

పై నెంబరు వాజ్యంలో మీకు పై కోర్టువారి నుండి అనేకసార్లు మీకు నోటీసులు పంపినా మీరు తీసుకోనందున సదరు వ్యాజ్యంలో మీకు నోటీసు నిమిత్తం తే 22-9-2025దీన వాయిదా ఉన్నది. సదరు వ్యాజ్యంలో మీకు ఆక్షేపణలున్న ఎడల **తే 22-9-2025దీన ఉదయం 10-30 గం॥లకు** పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలెను. లేనిచో పై వ్యాజ్యం మీ పరోక్షమందు తీర్మానించబడును.

ఇట్లు
J.BHEEMASENA RAO
M.GOPINADH
Advocates, Vizianagaram
Cell: 9441053628

IN THE HONOURABLE COURT OF THE V ADDITIONAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
O.S.16/2022

Between
Narikenapalli Srikanth Chitambara Swamy ......Plaintiff
AND:
1) Narikenabilli Srirama Murty (Died)
2) Narikenabilli Chitambara Swamy @ Shankar And Others .....Defendants
To,
D-7) Smt Kattamuri Rajeswari W/o Sanyasi Setty, aged about 68 years House-Wife, Door No. 14-6-4/A, Kamma Veedhi, VIZIANAGARAM

Whereas the above named plaintiffs have instituted a suit against you for declaration and with other reliefs. You are hereby summoned to appear in this Court in person or by a pleader, duly instructed and able to answer all material questions relating to the suit of who shall be accompanied by some person able to answer all such questions on the **Day of 29th September, 2025, at 10-30 A.M.** to answer the claim and further you are hereby directed to file within 30 days of service of summons a written statement of your defence and to produce on the said day all documents in your possession or power upon which you base your defence.

Take Notice that in default of your appearance and to file your written statement within thirty days the suit will be heard and determined in your absence.

By Order of the Honourable Court

I. RAMESH
ADVOCATE
K.L.PURAM
VIZIANAGARAM

Vizianagaram
Dt. 16-09-2025